క్లుప్తంగా...

దశలవారీగా సమస్యలకు పరిష్కారం



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తున్నామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. టీఆర్‌టీ క్వార్టర్స్‌లో చేపట్టిన పూడికతీత పనులు ఆమె పర్యవేక్షించిన అనంతరం మాట్లాడారు. వీధుల పరిశుభ్రత కోసం దళితబంధు పథకం ద్వారా ప్రత్యేక స్లిట్ కార్డింగ్ వాహనం కేటాయించబడిందని ఈ వాహనం ద్వారానే పూడికతీత, మట్టి తొలగింపు పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అన్విత్ పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

సనత్‌నగర్: మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ గంగాధర్ వివరాల ప్రకారం..బేగంపేట అల్లాద్దీన్ బిల్డింగ్ అంబేడ్కర్‌నగర్‌కు చెందిన చంద్రయ్య (85) జూ ఉదయం తన ఇంటి వద్ద నుంచి ప్రకాష్‌నగర్ మెట్రో స్టేషన్ వరకు వాకింగ్‌కు వెళ్లి వస్తుంటాడు. ఈ నెల 1న ఉదయం వెళ్లిన చంద్రయ్య ఎంతకీ ఇంటికి రాలేదు. గతంలో ఒకసారి అదృశ్యమై తర్వాతి రోజు ఇంటికి వచ్చాడు. ఈ సారి నాలుగు రోజులైనా రాకపోవడంతో మనుమడు రాజు పోలీసులను ఆశ్రయించాడు.

ఫిట్స్ వచ్చి యువకుడి మృతి

అమీర్‌పేట: హై ఫీవర్‌తో ఫిట్స్ వచ్చి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రాంప్రసాదరావు వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్‌కు చెందిన రఘు (34) ఎస్ఆర్‌నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ యాక్సిస్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. జ్వరం రావడంతో మంగళవారం సాయంత్రం మందులు కొనుక్కునేందుకు స్థానికంగా ఉన్న మెడికల్‌కు వెళ్లి మందులు తీసుకుని మెడికల్ షాపు మెట్లు దిగుతుండగా కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసుల సహాయంతో అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. హై ఫీవర్ కారణంగా ఫిట్స్ రావడంతోనే కింద పడిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు లేరని హాస్టల్‌లో ఉంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రజలకు మేలు చేయాలన్నదే లక్ష్యం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాలన్నదే తన లక్ష్యమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. సనత్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏకేగౌడ్ ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీ పనులు, నీమ్‌కార్‌నగర్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొమ్మిదిన్నరేళ్లలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలో రూ.1,400 కోట్లకు పైగా వ్యయంతో అనేక అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ఈ ప్రాంతం నుంచి గెలిచి ముఖ్యమంత్రిగా పనిచేసిన వారు కూడా చేయలేని అనేక పనులను తాము చేసినట్లు వెల్లడించారు. ఇండస్ట్రియల్ పార్కు నుంచి బాలానగర్ చౌరస్తా వరకు అండర్‌పాస్ నిర్మాణ పనుల కోసం రూ.100 కోట్లను మంజూరు చేయించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ వెంకటేష్, డీఎంసీ జగన్, ఈఈ ఇందిర, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, నాయకులు కొలను బాల్‌రెడ్డి, బాలరాజ్, ఓంప్రకాష్ శర్మ పాల్గొన్నారు. అనంతరం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద 400 మంది బీసీ కుల వృత్తిదారులకు రూ. లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

క్రీడాభివృద్ధికి కృషి..

అమీర్‌పేట: క్రీడలను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేట గురుగోవిందసింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రీడాకారులకు మంత్రి కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారులను సైతం ప్రోత్సహించే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా సీఎం ఆట పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను యువత సద్వినియోగం చేసుకుని క్రీడల్లో మరింతగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో నామన శేషకుమారి, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ మాధవి పాల్గొన్నారు.

ఆదర్శ వైకుంఠధామంగా ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్..

రాష్ట్రంలోనే ఆదర్శ వైకుంఠధామంగా ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్‌ను తీర్చి దిద్దుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వైకుంఠధామం అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. దాదాపు 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ గ్రేవ్ యార్డ్‌లో ఇక్కడికి వచ్చే వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు, వసతులు కల్పిస్తున్నామన్నారు. మనిషి చివరి మజిలీ ముగిసే వైకుంఠధామాల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలనే సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని వైకుంఠధామాలను అభివృద్ధి చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేష్,డీ.సి.సగన్, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, అధికారులు ఇందిర, హరిశంకర్, బీఆర్ఎస్ నాయకులు హనుమంత్‌రావు, లలితాచౌహన్, నర్సింహ,కట్ట బలరాం పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

రాంగోపాల్‌పేట్: మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరుణగౌడ్ మాట్లాడుతూ.. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ పుట్టిన రోజు సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జీరాలోని వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం, మహంకాళి దేవాలయంలో హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

బౌద్ధనగర్: సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. బౌద్ధనగర్ డివిజన్ అంబర్‌నగర్, ఎల్ఎస్.నగర్, వారాసిగూడ, అశోక్ నగర్, సంజీవపురం తదితర ప్రాంతాల్లో సుమారు రూ. 2 కోట్ల ఖర్చుతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని, అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా నిర్వహిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఓ వైపు, తాము చేపడుతున్న అభివృద్ధి పనులు మరోవైపు సికింద్రాబాద్ ప్రజానీకం నుంచి తాము మెప్పును పొందేలా దోహదపడుతున్నాయన్నారు. కార్పొరేటర్ కంది శైలజ, కిషోర్ గౌడ్, రామేశ్వర్‌గౌడ్, రామ్‌చందర్, నారాయణ, రాజేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులతో టెలీ కాన్ఫరెన్స్

సికింద్రాబాద్: నియోజకవర్గానికి చెందిన మూడో విడతలో ఎంపికైన డబుల్ 'ఇళ్ల' లబ్ధిదారులతో పద్మారావుగౌడ్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడో విడత డ్రా లో భాగంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1770 మందికి ఇళ్లను కేటాయించారు. ఎవ్వరికీ ఒక్క పైసా కూడా ఇవ్వకుండా, ఏ కార్యాలయం చుట్టూ తిరగకుండా కేసీఆర్ ప్రభుత్వం లక్షల విలువ చేసే ఈ ఇళ్లను ఉచితంగా అందజేస్తుందన్నారు.

ఏసీపీ కార్యాలయం సందర్శన..

బౌద్ధనగర్: వారాసిగూడలోని చిలకలగూడ ఏసీపీ కార్యాలయాన్ని బుధవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సందర్శించారు. వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలకై డివిజన్‌లో పర్యటిస్తున్న ఆయన ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి, సీఐ శంకర్, ఎస్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

కార్యకర్త అంతిమయాత్రలో..

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బుధవారం మరణించాడు. విషయం తెలుసుకున్న పద్మారావుగౌడ్ స్థానిక కార్పొరేటర్ సునీతతో కలిసి కార్యకర్త అంతిమయాత్రలో పాల్గొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు..



పనులకు శంకుస్థాపన చేస్తున్న పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: గడిచిన తొమ్మిదేళ్లలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో తొమ్మిది సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మంగళవారం రాత్రి సీతాఫల్‌మండిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ నేతృత్వంలో ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమలు హాజరయ్యారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి అనేక అభివృద్ధి పథకాలు చేపట్టి, అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను అందించినట్లు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్‌ను ఆదర్శంగా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు.

ట్రైబల్ యూనివర్సిటీకి సమ్మక్క- సారలమ్మ పేరు హర్షణీయం



ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: ములుగు జిల్లాలో సమ్మక్క–సారలమ్మ పేరుపై ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించడం హర్షణీయమని మాజీ మేయర్ బండా కార్తీకరెడ్డి అన్నారు. బుధవారం ఆమె బీజేపీ నాయకులతో కలిసి తుకారాం గేట్ రియోపాయింట్ హోటల్ సమీపంలో గిరిజన మహిళలతో కలిసి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ములుగు జిల్లాలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ప్రధాని మోదీకి రాష్ట్రంలోని ఆదివాసి బిడ్డలందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉన్న బడుగు బలహీన వర్గాలకు ప్రధాని మోదీ ఓ ఆశాజ్యోతిగా నిలిచారని, ఎస్సీ ఎస్టీలను రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటూ వారిని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు శ్యామ్ సుందర్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఆదం విజయ్, వీరన్న, హంసరాజు, హరి, శారద మల్లేష్, దిలీప్, రాజేష్, మహేందర్, నందు, వేణు, నరేందర్, కళావతి, శంకర్, శాంతాబాయి పాల్గొన్నారు.

పద్మారావునగర్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్‌డ్రైవ్



పద్మారావునగర్‌లో స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న సీఐ శ్రీనివాస్, ఎస్.ఐ కరుణాకర్

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావు నగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ కరుణాకర్, ఏఎస్ఐ మహేంద్రమణి తదితరులు కలిసి పద్మారావునగర్ గాంధీ ఆసుపత్రి వెనుక వైపు రోడ్డులో అక్రమ పార్కింగ్ వాహనాలను తొలగించారు. చాలా కాలం నుంచి అనేక మంది కార్లు, వ్యాన్లు, బస్సులు, కాంక్రీట్ వాహనాలను రోడ్డు పక్కన పార్కు చేస్తున్నారు. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రజలు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలకు ఛలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్.ఐ కరుణాకర్ మాట్లాడుతూ.. రోడ్డు పక్కన చాలా రోజుల నుంచి అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. వాహనచోదకులు తమ వాహనాలను రోడ్డు పక్కనే చాలా రోజులు పార్కు చేయరాదన్నారు. చిలకలగూడ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామన్నారు.

సికింద్రాబాద్ ఓటర్ల తుది జాబితా విడుదల

మొత్తం ఓటర్లు	2,56,555
పురుషులు	1,29,144
మహిళలు	1,27,392
ఇతరులు	19
మొత్తం బిల్డింగ్‌లు	105
పోలింగ్ స్టేషన్లు	220



తుది జాబితాను ఏర్పాటు చేసిన దృశ్యం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి సంబంధించి ఓటరు తుది జాబితాను విడుదల చేసినట్లు ఈఆర్వో, డీసీ సుధాంశ్ తెలిపారు. ఓటరు జాబితాకు సంబంధించిన ఫామ్–16ను సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధాంశ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకు కొత్తగా నమోదైన ఓటర్లు, ఇతర క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌కు సంబంధించి తుది జాబితాను ప్రకటించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషనర్ ఆదేశానుసారం జిల్లా ఎన్నికల అధికారి, జోనల్ కమిషనర్ నేతృత్వంలో ఈ జాబితాను ప్రకటించి నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశామన్నారు.

విద్యతోనే ఉప కులాల వర్గాల్లో మార్పు

రసూల్‌పురా: తమ పిల్లలను బడికి కాకుండా పనులకు పంపడంతోనే ఎస్సీ ఉపకులాల వర్గాలవారు వెనుకంజలో ఉన్నారని డా. అంబేడ్కర్ మనవడు ప్రకాష్ అంబేడ్కర్ అన్నారు. కంటోన్మెంట్ మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో బుధవారం ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరు విద్యను అలవర్చుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆ దిశగా ఉపకులాల వారు ముందుకు సాగాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉపకులాలకు చెందిన వారు అభ్యర్థులు గెలిస్తే మన జీవితాలు బాగుపడుతాయన్నారు. ఉపకులాలకు చెందిన వారందరికి దళితబంధు వర్తింపజేయాలని, గ్రామాల్లో దళితవాడలను గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని, ప్రభుత్వ రెసిడెన్సీయల్ స్కూళ్లల్లో ఎలాంటి నిబంధనలు లేకుండా ఉపకులాల వారి పిల్లలకు అడ్మిషన్ ఇవ్వాలని ఇతర అంశాలపై తీర్మానాలు చేశారు.

'కంటోన్మెంట్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం'



ప్రచారం చేస్తున్న లాస్యనందిత

రసూల్‌పురా: సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో పార్టీ విజయానికి దోహదపడుతాయని అభ్యర్థి లాస్యనందిత అన్నారు. నియోజకవర్గంలోని బొలంరాయిలో బుధవారం బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్‌తో కలిసి ఆమె ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ.. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని కంటోన్మెంట్‌లో పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు, కల్యాణలక్ష్మి, షాదిముబారక్, వివిధ రకాల పింఛన్లు, ఉచిత మంచినీటి పథకం, దళితబంధు, బీసీ బంధు, గృహలక్ష్మి, ఇతర పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. తన ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తన తండ్రి దివంగత ఎమ్మెల్యే జి. సాయన్న చేసిన సేవలను గుర్తు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సాయికిరణ్, నివేదిత, శోభ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు ప్రధాని క్షమాపణ చెప్పాలి



ప్రధాని దిష్టి బొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

లాలాపేట: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అబద్ధపు ఆరోపణలు చేసిన ప్రధాని మోదీ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మోదీ వ్యాఖ్యాలను వ్యతిరేకిస్తూ బుధవారం తార్నాకలో ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చి అబద్ధాల కోరుగా మాట్లాడుతూ ప్రధాని తన పదవిని దిగజార్చారని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరచడం మోదీకి అలవాటుగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై పార్లమెంట్ సాక్షిగా ఇప్పటికే పలుమార్లు మోదీ విషం కక్కారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండడంతో తెలంగాణ పై ఎక్కడలేని ప్రేమను చూపిస్తున్నారని బీజేపీ పార్టీ వైఖరిని తెలంగాణ సమాజం గమనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, బీఆర్ఎస్ నేతలు మోతె శోభన్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వనజ పాల్గొన్నారు.

బెంగాలీ హ్యాండ్లూమ్ ఆర్ట్ ప్రారంభం



హ్యాండ్లూమ్ ఆర్ట్‌ను ప్రారంభిస్తున్న సంజయ్‌నాయక్, సోమనాథ్ భోమిక్

సనత్‌నగర్: బేగంపేట గ్రీన్‌ల్యాండ్స్ రోడ్డులోని వైట్ హౌస్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేసిన బెంగాలీ హ్యాండ్లూమ్ ఆర్ట్‌ను బుధశారం కల్నల్ సంజయ్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వప భోమిక్, సోమనాథ్ భోమిక్ మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్ నుంచి సర్టిఫైడ్ జెన్యూన్ సిల్క్, కాటన్, లినెన్, చేనేత ఉత్పత్తుల తయారీదారుల నుంచి సేకరించిన ప్రత్యేక నేచురల్ ఫ్యాబ్రిక్ చీరలు, సూట్స్, బ్లౌజు పీస్‌లు తదితర ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే ఢకాయ్ జమ్దానీ, బనారస్, సిల్క్ జమ్దానీ, టస్సర్ సిల్క్, మట్కా సిల్క్, బైలూమ్, కాంతా, హ్యాండ్ పెయింటెడ్, లినెన్, ఖాదీ, కాటన్ జమ్దానీ, ముంగా సిల్క్(అస్సాం) తదితర ఉత్పత్తులు తమ ప్రత్యేకమన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు వివరాల ప్రకారం.. కామారెడ్డిలోని జంగంపల్లికి చెందిన దోమకొండ యాదయ్య(69) బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి. కొంతకాలంగా మెట్టుగూడలో నివాసముంటున్న ఆయన ఈ నెల 3న రాత్రి 12 గంటల సమయంలో మల్కాజ్‌గిరి–సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలు దాటుతుండగా కరీంనగర్ నుంచి కాచిగూడ వెళ్లే ప్యాసింజర్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

బతుకమ్మ చీరల పంపిణీ



బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగ అని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. బుధవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ ఏటా బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు చీరలను అందజేస్తుందన్నారు. హైదకరాబాద్ జిల్లా వ్యాప్తంగా 481 కేంద్రాలలో 940369 చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 13వ తేదీ వరకు బతుకమ్మ చీరలను పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.

సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



చీరలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతా శోభన్‌రెడ్డి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో 17 కేంద్రాల ద్వారా 65,972 మందికి బతుకమ్మ చీరల పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

చాచానెహ్రూనగర్‌లో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచా నెహ్రూనగర్‌లో బుధవారం కార్పొరేటర్ కె. హేమలత బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించి గౌరవిస్తోందన్నారు. పేదలు పండుగలు ఆనందంతో జరుపుకోవాలనే ఉద్దేశంతో బతుకమ్మ కానుకలను అందజేస్తున్నారని వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పండుగల సమయంలో పేదలకు కానుకలు అందజేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.



బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న హేమలత


హక్కుల సాధనకు కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న సికింద్రాబాద్ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

సికింద్రాబాద్: హక్కుల సాధన కోసం ముదిరాజ్‌లు సంఘటితంగా కృషి చేయాలని సికింద్రాబాద్ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం నామాలగుండులోని బీఎస్ఆర్ గార్డెన్స్‌లో నియోజకవర్గ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. పరేడ్ మైదానంలో ఈ నెల 8న నిర్వహించనున్న ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రాతిపదికన మేరకు ముదిరాజ్‌లకు టికెట్లు కేటాయించే పార్టీలకే రాబోయే ఎన్నికల్లో మద్దతివ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించినప్పటికీ వారిలో ఒక్క ముదిరాజ్ కులస్తులు కూడా లేకపోవడాన్ని తప్పుబట్టారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సామల హేమ, ప్రతినిధులు మేకల సారంగపాణి, కరాటేరాజు, ఆకుల నాగభూషణం, కనకట్ల హరి, గణేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

అండర్సన్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు



బ్రోచర్‌ను ఆవిష్కరించిన సంస్థ ప్రతినిధులు

అమీర్‌పేట: అమెరికా యాపిల్ డిస్టింగ్విష్డ్ యూనివర్సిటీగా పేరున్న అండర్సన్ యూనివర్సిటీలో హైదరాబాద్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ ప్రోవోస్ట్ డాక్టర్ ర్యాన్ నీల్, జాన్‌డాన్ తెలిపారు.బుధవారం అమీర్‌పేట ఆదిత్య పార్కు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీ హబ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో 5వ తేదీన ఇదే హోటల్‌లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నామన్నారు. కంప్యూటర్ సైన్స్, బిజినెస్ ఎనలిటిక్స్ ప్రోగ్రామ్‌లలో ఎంఎస్‌తో పాటు డేటా డ్రివెన్ నైపుణ్యాలు, సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్ లాంటి కోర్సులు ఉన్నాయన్నారు. యూనివర్సిటీ హబ్ ఇప్పటి వరకు లక్ష మంది విద్యార్థులకు ఆమెరికాలోని ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదువుకునే అవకాశం కల్పించిందని గుర్తు చేశారు.